క్లుప్తంగా

## శ్రీనివాస శర్మ, నటుడు కావూరికి సన్మానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఖగోళ వాస్తు శాస్త్రాలు సశాస్త్రీయమైనవని, సూర్యచంద్రులు, నక్షత్రాల గమనాల ఆధారంగా మానవ హితం కోరి శాస్త్రాలు ఏర్పడ్డాయని ప్రముఖ వాస్తు జ్యోతిష సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని రీడింగ్ రూమ్స్ భవన సమావేశ మందిరంలో శాస్త్రాలపై, బ్రాహ్మణత్వంపై జరుగుతున్న అశాస్త్రీయ దాడులకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సిద్ధాంతి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ మన విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న పాశ్చాత్య దేశాలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దశాబ్దాలుగా దేవాలయాలను ఆదాయ వనరులుగా చూడటం, ధర్మాన్ని కాపాడే బ్రాహ్మణులపై కొంత మంది అధికారుల పెత్తనం బాధాకరమన్నారు. ఈ ధోరణి మారగలిగితేనే హిందూ సమాజం మనుగడ సాగించగలదన్నారు. సిద్ధాంతి శ్రీనివాస శర్మ, రంగస్థల నటులు కావూరి సత్యనారాయణను సత్కరించారు. ములుగు వెంకట మురళీమోహన్, ఎన్నారై ఇక్కుర్తి వెంకట్, బండ్లమూడి రోజా రమణి, చుండూరు సుందర రామశర్మ, అద్దేపల్లి రమణ, దేశరాజు పట్టాభి, భట్రాజు సాయి ప్రసాద్, జేవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జై భారత్ నేషనల్ పార్టీ మేనిఫెస్టో ఆవిష్కరణ

నెహ్రూనగర్: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా చేయడమే తమ లక్ష్యమని జై భారత్ నేషనల్ పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకుపల్లి జోషి రంగనాథ్ పేర్కొన్నారు. ఆదివారం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

## నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ పరిశోధకుడు ఎస్. నాగేశ్వరరావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. సోషియాలజీ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఆల్కాహాలిజం ఆన్ షెడ్యూల్డ్ కాస్ట్ పాపులేషన్ ఇన్ గుంటూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను నాగేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని తెలిపారు.

## నవ్వుతోనే ఆరోగ్యం



గుంటూరు వెస్ట్: ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనే గొప్ప ఆయుధం నవ్వని లాఫింగ్ క్లబ్ గుంటూరు వ్యవస్థాపకులు లాల్ వజీర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ వజీర్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలుగా మేలన్నారు. సమస్యలు రాని మనుషులు ఉండరని, వాటిని చిరునవ్వుతో ఎదిరిస్తే ప్రపంచాన్ని జయించేంత ఆత్మ బలం చేకూరుతుందన్నారు. చక్కని వ్యాయామం, యోగ, మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ జీవించాలని దీనికి అదనంగా నవ్వును కూడా జోడించాలన్నారు. లాఫింగ్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా నవ్వుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

**నవ్వు ఒక దివ్య ఔషధం**

లక్ష్మీపురం: నవ్వు ఒక భోగమని, నవ్వకపోవడం ఒక రోగమని, నవ్వించడం ఒక యోగమని ఓ చిరునవ్వు అనేక మందిని దగ్గర చేస్తుందని ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండేలా చేస్తుందని హాస్యవల్లరి కో ఆర్డినేటర్ వి.వి. రావ్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రి డాక్టర్ చంద్ర రాధికా రాణి మాట్లాడారు.

## చలివేంద్రం ఏర్పాటు

నెహ్రూనగర్: ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ చర్చి ఆధ్వర్యంలో చర్చి ఎదురు చలివేంద్రాన్ని చర్చి ఫాదర్ రెవ. ఏరువా బాల చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఏసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కనపాల జోసఫ్ సహకారంతో ఏర్పడిన ఈ చలివేంద్రం చర్చి ఎదుట ఉన్న గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఫాదర్ బాల పేర్కొన్నారు. కనపాల జోసఫ్ మాట్లాడుతూ కరోనా సమయంలో చర్చి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కతోలిక సంఘస్తులు, మద్దు సాగర్, హృదయరాజు పాల్గొన్నారు.

# ఎవరెన్ని కుట్రలు పన్నినా జనం జగనన్న వైపే

- ప్రత్యక్షంగా జనసేన, బీజేపీలతో జత కట్టిన టీడీపీ
- పరోక్షంగా కాంగ్రెస్‌తో రహస్య లాలూచీ
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 49వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమం
- ప్రచారంలో పాల్గొన్న విప్ లేళ్ల అప్పిరెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి రజని, విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: ఎవరెన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో ప్రజలంతా అధికశాతం జగనన్న వైపే ఉన్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని అన్నారు. గుంటూరు 49వ డివిజన్‌లో ఆదివారం మనతో మన రజినమ్మ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ టీడీపీ ఒంటరిగా పోటీ చేసి గెలవలేననే భయంతో జనసేనను కలుపుకొందని, అయినా ధైర్యం చాలక ఢిల్లీ దర్బారు ముందు సాగిలపడి బీజేపీతో కూడా జతకట్టిందన్నారు. అప్పటికీ ఇంకా గెలుపు మీద ధైర్యం లేక పరోక్షంగా కాంగ్రెస్‌ను ఎగదోసి వైఎస్సార్ సీపీకి పడే ఓట్లు చీల్చే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఎన్ని జట్లు కట్టినా చంద్రబాబుకు ఓటమి భయం వీడటం లేదన్నారు. ఎవరు ఎన్ని పన్నాగాలు పన్నినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. మొన్నటి దాకా వలంటీర్లపై విషం చిమ్మారని, ఇప్పుడే ఆ వలంటీర్లను కొనసాగిస్తామని, వాళ్లకు ఇంకా ఎక్కువ జీతం ఇస్తామని మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు. జగనన్న సంక్షేమ పథకాలు ఇస్తుంటే జనాల్ని సోమరిపోతుల్ని చేస్తారా అని విమర్శించారని, ఇప్పుడు చంద్రబాబు తాము అంతకంటే ఎక్కువ ఇస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

**దొంగ హామీలకు మరోసారి చెంపదెబ్బ తప్పదు..**

చంద్రబాబునాయుడు అలవి కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనివైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ఎన్ని దొంగ హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇచ్చి, ఆ తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. తొలుత నాయకులు 49వ డివిజన్ పరిధిలోని పొట్టి శ్రీరాములు నగర్, భారత్‌పేట, పోస్టల్ కాలనీ, వేళాంగిణి నగర్, కొండయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కిషోర్, తమ్మిశెట్టి రవి, కుంచాల శివకుమార్, గుబ్బా వేణుగోపాల్, విష్ణుమొలకల నాగప్రసాద్, ఓలేటి అరవింద్, ఆవులమంద శంకర్, జాన్సన్, కోలవెన్ను దుర్గాదేవి, లుక్కా రాణి, దేశమాల ప్రసన్నకుమార్, మట్టిగుంట ప్రసన్నకుమార్, జొన్నలగడ్డ సతీష్‌కుమార్, బి.రవికుమార్, పర్వతరెడ్డి శ్యామ్‌రాజ్, మలికే రమేష్ పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెబుతాం

భారత్ బచావ్ ప్రతినిధులు పిలుపు

లక్ష్మీపురం: మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెప్పాలని భారత్ బచావో ప్రతినిధులు డాక్టర్ గోపినాథ్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం భారత్ బచావో ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ, అంబానీల లాంటి కార్పొరేట్ కంపెనీలకు సంపాదను దోచిపెట్టిన మోదీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. బీజేపీతో పాటు మిత్రులైన టీడీపీ, జనసేన పార్టీలను ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ వైస్‌చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మి, భారత్ బచావో ఆంధ్రప్రదేశ్ చైర్మన్ సి.భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా నవజ్యోతి మాట్లాడారు. మే 13వ తేదీ ఎన్నికలలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ, సిపిఐ(యం-యల్), వీసీకే పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో భారత్ బచావో జిల్లా అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు, కార్యదర్శి సమతావేము, న్యాయవాది శిఖా సురేష్ పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీలకు అండగా వైఎస్ జగన్

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కలీం

లక్ష్మీపురం: ముస్లిం మైనారిటీలకు అండగా నిలబడతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కలీం పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజకవర్గ సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలో వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో మరో ప్రధాన పార్టీలు అయిన తెలుగుదేశం, బీజేపీ, జనసేనతో కూటమి ఏర్పాటు చేసి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్నదని, బీజేపీ జాతీయ నాయకులు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకించడం సిగ్గుచేటు అన్నారు.

## అలరించిన మధువని సుస్వరాల పల్లకి



గీతాలు ఆలపిస్తున్న గాయనీ, గాయకులు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో సినీ సంగీత విభావరి ఆధ్వర్యం లో ఆదివారం సాయంత్రం 'మధువని' సుస్వరాల పల్లకి నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త గాదె రత్నారెడ్డి, విద్యాశాఖ ఏడీ రాజంశెట్టి నరసింహారావు, భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయనీ, గాయకులు మధు బాబు, కృష్ణారావు, శివప్రసాదరావు, శ్రీనివాసరావు, నారాయణరావు, రామకృష్ణ, గాయత్రీదేవి, సౌజన్య, అన్నపూర్ణలు పాత, కొత్త చిత్రాల గీతాలను ఆలపించారు. సినీ ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమానికి వ్యాఖ్యతగా కృష్ణారావు వ్యవహరించగా, సినీ సంగీత విభావరి వ్యవస్థాపకులు వెలిశెల మధుబాబు, కొల్లూరు శివప్రసాదరావు, పాలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన పలువురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంజీవయ్యనగర్ ఫస్ట్ లైన్‌లో నివాసించే ద్వారక మధ్యవర్తుల ద్వారా ప్రైవేట్ బ్యాంకులో లోన్ తీసుకుంది. ఐదు నెలలుగా బ్యాంకు వాయిదాలు చెల్లించడం లేదు. మధ్యవర్తిగా వ్యవహరించిన లక్ష్మి, గాయత్రి, కల్యాణి, బాలు ఆదివారం ద్వారకా వద్దకు వెళ్లి లోన్ ఎందుకు చెల్లించడం లేదని అడిగారు. వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. లక్ష్మి, గాయత్రీ, కల్యాణి, బాలు కులం పేరుతో దూషించి చెయ్యి చేసుకున్నారు. ద్వారాక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే లక్ష్మి, గాయత్రీ, కల్యాణి, బాలు లోన్ డబ్బులు అడిగేందుకు ద్వారక ఇంటికి వెళ్లగా ఆమె తండ్రి నలుగురిపై దాడి చేసినట్లు ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్ టీవీ రవిప్రకాష్‌పై జాతీయ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

నెహ్రూనగర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ, వచ్చే ఎన్నికల్లో గెలవదని తన సొంత డిజిటల్ యూ ట్యూబ్‌లో తన స్వలాభం కోసం ప్రచారం చేసుకుంటున్న ఆర్‌టీవీ ఛానల్ రవి ప్రకాష్‌పై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్‌కుమార్ జాతీయ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. రవిప్రకాష్ అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీని కించపరుస్తూ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవచ్చు, గెలవకపోవచ్చు అని చెప్పకుండా వారు ఓడిపోతారని చెప్పడం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని వివరించారు.

## నేటి నుంచి కరీముల్లా ఉరుసు మహోత్సవం



పెదకాకాని: పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 15వ ఉరుసు గంధ మహోత్సవవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు వేడుకల నేపథ్యంలో కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం కళకళలాడుతుంది.

పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్న సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా నిషాని వ్యవస్థాపకుడు పఠాన్ మహబుబ్ సుమాని తెలిపారు.మూడు రోజుల ఉరుసు మహోత్సవాల్లో బాగంగా ఆరోతేదీ రాత్రి కంబల్ పాతేహాతో ఉరుసు మహోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. రెండోరోజు గంధం మహోత్సవము, చివరి రోజు దీపారాధన, అన్నసంతర్పణ ఉంటుందని వివరించారు.

## బొంగరాలబీడు మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం



నగరంపాలెం: స్థానిక బొంగాల బీడు మహాప్రస్థానం అభివృద్ధి కోసం ముల్లమూరి మాలకొండయ్య రూ.1,00,116 విరాళం ఆదివారం కమిటీ సభ్యులకు అందించారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని శ్మశాన వాటిక అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కల్లూరి రమణయ్య అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూనల మాలకొండయ్య, ధనియాల గాంధీ, జంగాలపల్లి పార్థసారథి, నిమ్మగడ్డ అంకమ్మచౌదరి పాల్గొన్నారు.



ఆర్ట్ మాస్టారు మధు చాక్‌పీస్‌లతో తీర్చిదిద్దిన కళా ఖండాలు



ఆర్ట్ మాస్టారు మధు చాక్‌పీస్‌లతో తీర్చిదిద్దిన కాణిపాక వినాయకుడు, శంఖం, గోపురం



చాక్‌పీస్‌లతో కార్వింగ్ చేస్తున్న ఆర్ట్ మాస్టారు మధు

## సుద్దముక్కలతో అద్భుత కళాఖండాలు

- చాక్‌పీస్ కార్వింగ్‌లో నైపుణ్యం సాధించిన చిత్రకారుడు
- గుంటూరుకు చెందిన మధుసూదనరావు ప్రతిభ
- చాక్‌పీస్‌లపై ప్రతిమలకు రూపం
- చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: బ్లాక్‌బోర్డుపై అక్షరాలను రాసే సుద్దముక్కకు జీవం పోశారు ఆ కళాకారుడు. చిత్రలేఖనంలో నైపుణ్యవంతుడైన గురువుగా గుర్తింపు పొందడంతో పాటు తాను నేర్చుకున్న విద్యను పదిమందికీ పంచుతున్నారు. చాక్‌పీస్‌పై అత్యంత సూక్ష్మ దృష్టి, నైపుణ్యంతో కళా ఖండాలను తీర్చిదిద్దడంలో ఖ్యాతి సంపాదించారు. గుంటూరు నగరానికి చెందిన మధుసూదనరావు బ్రాడీపేట 4/19లో మధుర్ ఆర్ట్స్ స్కూల్ నిర్వహిస్తున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్‌తో పాటు హ్యాండ్ క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ ఇస్తున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్‌లో శిక్షణ శిబిరాలను నిర్వహించడంతో పాటు ప్రతి యేటా విద్యార్థులతో ఆర్ట్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ, విద్యార్థులు గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు.

ఆర్ట్ మాస్టారుగా 30 ఏళ్ల వృత్తి జీవితంలో వందలాది మందిని చిత్ర కళాకారులుగా తీర్చిదిద్దిన మధు తనలో దాగిన మరొక నైపుణ్యానికి పదును పెడుతూ ఉంటారు. చాక్‌పీస్‌పై అత్యంత సూక్ష్మ కళారూపాలను చెక్కడం ఆయనలోని అభిరుచికి అద్దం పడుతుంది. ఈ విధంగా ఆయన ఇప్పటి వరకు చాక్‌పీస్‌లపై 30 రకాల కళా ఖండాలను ఆవిష్కరించారు. అదీ చాక్‌పీస్ మొత్తం కాకుండా కేవలం చాక్‌పీస్ తల భాగంలో అంగుళం వ్యాసార్థంలోనే కళా ఖండాలను చెక్కడం అద్భుతమనే చెప్పాలి.ఒక చేత్తో చాక్‌పీస్ పట్టుకుని మరోచేత్తో పదునైన చాకులాంటి వస్తువుతో చాక్‌పీస్ మొనపై అందమైన కళారూపాలతో జీవం పోయడం ఆయనలోని నైపుణ్యానికి నిదర్శనం, ఈ విధంగా ఆర్ట్ మాస్టారు మధు చాక్‌పీస్ మొనపై అంగుళం స్థలంలోనే కాణిపాకం వరసిద్ధి వినాయకుడు, గుడి గోపురం, శివ లింగం, శంఖం, పెన్సిల్, బాల్, ముత్యపు చిప్ప, ఇల్లు, బాటిల్, పోస్టుడబ్బా, కలం, గ్లోబ్, కూజా, బ్యాట్‌తో పాటు అక్షరాలు వంటి 30 రకాల రూపాలతో తీర్చిదిద్దారు. చాక్‌పీస్ కార్వింగ్‌లో అత్యంత ప్రతిభావంతునిగా నిలిచిన మధు వద్ద ఈ విధంగా పెద్ద కలెక్షన్ ఉంది.

# వృద్ధులు, పెన్షనర్‌లకు అండగా సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య



ఎమ్మెల్యే రోశయ్యను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పట్నంబజారు: రాష్ట్రంలో వృద్ధులు, పెన్షనర్‌లకు అండగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. అరండల్‌పేటలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ది రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. వృద్ధాప్యంలో ఉన్న పండుటాకులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా నేరుగా పరిపాలననే వారి గడప వద్దకు చేర్చారన్నారు. పెన్షనర్‌లకు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టి ముందుకు సాగుతున్నారని వివరించారు. అన్ని విధాలుగా మనందరికి అండగా ఉంటున్న మీ బిడ్డ వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా తనని, ఏడు నియోజకవర్గాల్లో నిలబడుతున్న అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. తద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం రోశయ్యను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, కార్యదర్శి రాఘవబాబు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సమర్థంగా నిర్వర్తించాలి

ఎన్నికల పరిశీలకులు కార్తీక



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు కార్తీక, పక్కన తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పీఓలు, ఏపీఓలకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని సమర్థంగా పనిచేయాలని గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు ఎస్‌పీ కార్తీక తెలిపారు. ఆదివారం ఏసీ కాలేజీలో నిర్వహిస్తున్న తూర్పు నియోజకవర్గ పీఓలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణను రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరితో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వర్తించేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. ప్రధానంగా ఎన్నికల సరళిలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కారాల శిక్షణపై మాస్టర్ ట్రైనర్లు దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న పీఓలు కూడా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ఓ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ పీఓలకు జరుగుతున్న శిక్షణలో ప్రధానంగా పోలింగ్ రోజు పూర్తి చేయాల్సిన వివిధ ఫారాలు, పీఓ డైరీ, మాక్ పోల్, ఈవీఎంల కనెక్షన్, ఈవీఎం కవర్లు, స్టాట్యూటరీ కవర్లు తదితర అంశాలపై పీఓలు, ఏపీఓలు సమగ్రంగా తెలుసుకొని ఉండాలన్నారు.

## పాడైన ముక్కుకు పూర్వపు స్థితి

గుంటూరు ఓమేగా ఆస్పత్రిలో ముక్కు శస్త్రచికిత్స సక్సెస్



డాక్టర్ సుమితా శంకర్

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌తో ముక్కు ఆకారం పూర్తిగా కోల్పోయిన ఓ వృద్ధురాలికి గుంటూరు ఓమెగా హాస్పిటల్ వైద్యులు అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి ముక్కును పునర్నిర్మాణం చేశారు. గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలికి ఒమేగా ఆసుపత్రిలో ముక్కు పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ సుమితా శంకర్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.నాగకిషోర్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వృద్ధురాలు క్యాన్సర్ (కార్సినోమా నోస్)తో బాధ పడుతూ తమ వద్దకు చికిత్సకు వచ్చినట్లు చెప్పారు. ముక్కుపై మొదట్లో చిన్న పెరుగుదలగా కనిపించి, రెండేళ్లపాటు నిర్లక్ష్యం చేయడంతో క్రమంగా వ్యాపించి, ముక్కులో దాదాపు మూడు వంతుల భాగంలో కణితి పెరిగిపోయినట్లు తెలిపారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు పరిస్థితి గమనించి అత్యవసర చికిత్స కోసం ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చారన్నారు. మూడు నెలలపాటు రోగికి మూడు సార్లు ఆపరేషన్లు చేసి ముక్కుకు పూర్వపు ఆకారం తీసుకొచ్చామని వెల్లడించారు. పోలీసు శాఖ సిబ్బంది, వారి కుటుంబాల లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యభద్రతా పథకాన్ని ఉపయోగించి ఉచితంగా ఆపరేషన్ చేశామని వెల్లడించారు.

## ఓటరు చైతన్య ఉద్యమం అవసరం

- స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి
- బాలాజీ శ్రీనివాస్ పిలుపు





మాట్లాడుతున్న బాలాజీ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఓటర్ల చైతన్య ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లో సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంటే ప్రజలతో వారి సంక్షేమం, అవసరాల కోసం ఐదేళ్లకు ఒకసారి తమ ప్రతినిధిగా ఎన్నుకునే ప్రక్రియ అని అన్నారు. తక్కువ ఓటు శాతంతో ఎన్నుకోబడే ప్రజాప్రతినిధి బాధ్యతరాహిత్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 80 శాతానికి పైగా ఓట్లతో ఓటర్లు తమ ప్రతినిధిని ఎన్నుకోవడం ద్వారా సదరు ప్రజా ప్రతినిధి జవాబుదారీతనంతో ప్రజల సంక్షేమం కోసమే చట్టాలు చేసి, ప్రజల మన్ననలు పొందుతాడని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లలో ఉన్న చైతన్యం పట్టణ ప్రాంతాల్లో లేకపోవడం బాధాకరమని వివరించారు. తమ ప్రతినిధిని ఎంచుకునే ప్రక్రియలో ఓటరు కొంత సమయాన్ని పోలింగ్ బూత్ వద్ద కేటాయించటం బాధ్యతగా భావించాలని కోరారు. జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ సంస్థ జాతీయ చైర్మన్ ప్రొఫెసర్ సుబ్బరంగయ్య, రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం పెరుగుదలకు అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తోందన్నారు. దేశంలో 80 శాతం పైగా ఓటు నమోదు ప్రక్రియలో ప్రజలను జాగృతం చేసే విధంగా అంతర్జాతీయంగా సేవలకు మారుపేరుగా ఉన్న రోటరీ, లయన్స్ క్లబ్బులు ముందుకు రాగలిగితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు కేవీ భాస్కరరావు, కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, కోశాధికారి కేబీవీ ప్రసాద్, రొటేరియన్స్ సీతా రమేష్, గాలి సుబ్బారావు, ముప్పాళ్ళ సుబ్బారావు, పచ్చిపులుసు చిరంజీవి, బ్రహ్మం పాల్గొన్నారు.

## గో మాంసం తరలింపుపై విచారణ చేపట్టాలి

నగరంపాలెం: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో గోమాంసం తరలిస్తున్నారని ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహించారని శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశివస్వామి ఆరోపించారు. బ్రాడిపేట 1/1లోని బజరంగ్‌దళ్ గుంటూరు జిల్లా (విశ్వ హిందూ పరిషత్ యువజన విభాగం) కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. శివస్వామి మాట్లాడుతూ విశాఖపట్నం - సికింద్రాబాద్‌కు గోమాంసం తరలిస్తున్నారనే సమాచారంపై హిందూ సంఘాల నాయకులు, పలువురు స్వామీజీలు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు గోపీకృష్ణ, శివశక్తి అధ్యక్షుడు హర్షవర్ధన్‌శాస్త్రి, లక్ష్మీరామాంజిదాసి, ఏపీహెచ్‌డీఎస్ అధ్యక్షుడు అనిల్ బెహరా, యుగతులసీ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సత్యప్రమోద, భజరంగ్‌దళ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిశరత్, నవోదయం పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎన్.విజయరాజు, గోరక్ష నాయకులు హరిహరరాయలు, ప్రదీప్‌జైన్ పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు తెలంగాణ మద్యాన్ని సాయిప్రసాద్ కారులో తరలిస్తున్నాడు. కంకరగుంట ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న స్క్వాడ్ టీమ్ ఏడు లీటర్ల మద్యాన్ని, తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.